## సేవాలాల్ మహరాజ్ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలి

అక్కన్నపేట, డిసెంబర్ 21 : గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని గిరిజన మోర్చా మండల అధ్యక్షుడు అనిల్‌నాయక్ కోరారు. గురువారం మండల కేంద్రంలో గిరిజన సంఘాల నాయకులతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఫిబ్రవరి 15న సేవాలాల్ మహరాజ్ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. సమావేశంలో గిరిజన నాయకులు పాల్గొన్నారు.

## పల్లవి ప్రశాంత్ అరెస్టు బాధాకరం

మర్కూక్, డిసెంబర్ 21 : బిగ్‌బాస్ విన్నర్ పల్లవి ప్రశాంత్‌ను అరెస్టు చేయడం బాధాకరమని బీఆర్‌ఎస్ బీసీ సెల్ మండలాధ్యక్షుడు మేకల కనకయ్య ముదిరాజ్ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ హైదరాబాద్‌లో జరిగిన దాడికి గల కారణాలపై విచారణ జరిపి ప్రశాంత్‌ను విడుదల చేయాలని కోరారు. బిగ్‌బాస్-7లో విన్నర్ కావడంతో జీర్ణించుకోలేని కొందరు కావాలని అలజడి సృష్టించి ప్రశాంత్‌పై కేసు నమోదు చేయించారని తెలిపారు.

## బియ్యం అందజేత

కొండపాక(కుకునూరుపల్లి), డిసెంబర్ 21 : కుకునూరుపల్లి గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికుడు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కుకునూరుపల్లికి చెందిన బీజేపీ నాయకుడు దొంతి సత్యనారాయణ, టిఫిన్ సెంటర్ సంజీవులు, దేవీనారాయణ గురువారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి 75 కిలోల బియ్యం అందజేశారు. వారి వెంట వార్డు మెంబర్ చిన్న రాజు, నాయకులు కనకయ్య, మలగల కనకయ్య ఉన్నారు.

## ఇన్‌చార్జి కమిషనర్‌గా ఏఈ ప్రణీత్

హుస్నాబాద్ టౌన్, డిసెంబర్ 21 : హుస్నాబాద్ మున్సిపల్ కమిషనర్ ఎంఆర్ రాజశేఖర్ సెలవుపై వెళ్లడంతో మున్సిపల్ ఏఈ సాయిప్రణీత్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఈనెల 21 నుంచి 26 వరకు రాజశేఖర్ సెలవుపై వెళ్లడంతో ఇన్‌చార్జి కమిషనర్‌గా ఏఈ సాయిప్రణీత్‌కు బాధ్యతలు అప్పగించినట్లు తెలిసింది.

## స్వామివారికి పద్మపీఠం సమర్పణ

సిద్దిపేట టౌన్, డిసెంబర్ 21 : భక్తులు సమర్పించిన కానుకలతో వేంకటేశ్వరస్వామి వారికి సావర్కర్ సేవా సమితి వారు పద్మపీఠం తయారు చేయించి బహూకరించారు. ఈ సందర్భంగా సావర్కర్ సేవా సమితి ప్రతినిధులు మాట్లాడుతూ మొదటిసారిగా మోహినిపుర వేంకటేశ్వరస్వామి ఆలయం ముందు వైభవంగా సిద్దివినాయక ఉత్సవాలు నిర్వహించామన్నారు. భక్తులు హుండీలో వేసిన కానుకలతో వేంకటేశ్వర స్వామి వారికి పద్మపీఠం చేయించామని తెలిపారు.

## రాఘవాపూర్‌లో వైద్య శిబిరం

సిద్దిపేట రూరల్, డిసెంబర్ 21 : మండలంలోని రాఘవాపూర్ గ్రామం లో ఆర్బీఎం దవాఖాన ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రమేశ్, ఉపసర్పంచ్, వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పంట పెట్టుబడి సాయం అందజేయాలి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి

కొమురవెల్లి, డిసెంబర్ 21 : రైతులకు పంట పెట్టుబడి సాయం వెంటనే వారి ఖాతాల్లో జమ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం కొమురవెల్లి మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో రాంగసార్ సర్పంచ్ తాడూరి రవీందర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ గెలువగానే డిసెంబర్ 9న రైతుల ఖాతాలో రైతుబంధు డబ్బులు వేస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి.. ఇప్పటివరకు వేయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే రైతుబంధు డబ్బులు రైతుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి, జిల్లా నాయకులు దాసరి ప్రశాంత్, అత్తిని శారద, నాయకులు తేలు ఇస్తారి, తాడూరి మల్లేశం, చారి తదితరులు పాల్గొన్నారు.

# వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి


**దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత**

దుబ్బాక టౌన్, డిసెంబర్ 21 : ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత అన్నారు. గురువారం స్థానిక డబుల్ బెడ్ రూం కాలనీలో సీఎస్‌సీ సిద్దిపేట వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా ఉచిత వైద్య శిబిరాన్ని చైర్‌పర్సన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిబిరంలో పేదలకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు అందజేయడం అభినందనీయమన్నారు. అనంతరం చైర్‌పర్సన్ వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ యాదగిరి, కో-ఆప్షన్ సభ్యుడు స్వామి పాల్గొన్నారు.



శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత

# ప్రభుత్వ సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న టీజీబీ మేనేజర్ జ్యోత్స్న

అక్కన్నపేట, డిసెంబర్ 21 : కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అక్కన్నపేట తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ జ్యోత్స్న సూచించారు. వికసిత్ భారత్ సంకల్పయాత్రలో భాగంగా గురువారం మండలంలోని చాపగాని తండా గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరూ బ్యాంకు అకౌంట్ కలిగి ఉండాలన్నారు. బ్యాంకులో తక్కువ వడ్డీపై మహిళా సంఘాలకు రుణాలు, ముద్ర రుణాలు, రైతులకు స్వల్ప, దీర్ఘకాలిక రుణాలు, అన్ని రకాల బీమా పాలసీలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆయుష్మాన్ భారత్, కిసాన్ క్రెడిట్ కార్డులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీబీరన్న, పంచాయతీ కార్యదర్శి, ఏఈవో, అంగన్‌వాడీ టీచర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా రామానుజన్ జయంతి

మిరుదొడ్డి, డిసెంబర్ 21 : మిరుదొడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, అందె గ్రామంలో మిత్ర యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణిత శాస్త్రవేత్త రామానుజన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పౌర చట్టాలు, మహిళల రక్షణ చట్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎస్సై నరేశ్, సర్పంచ్ శంకర్, ప్రధానోపాధ్యాయుడు రాములు, ఉపాధ్యాయులు, మిత్ర యూత్ అధ్యక్షుడు భానుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**అక్కన్నపేటలో..**

అక్కన్నపేట, డిసెంబర్ 21 : గణితశాస్త్ర పితామహుడు శ్రీనివాస్‌రామానుజన్ సేవలు మరువలేనివని ఇన్‌చార్జి హెచ్‌ఎం, గణిత ఉపాధ్యాయుడు నోముల చంద్రారెడ్డి అన్నారు. మండలంలోని రామవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రామానుజన్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అక్కన్నపేట : రామానుజన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

**గజ్వేల్‌లో..**

గజ్వేల్, డిసెంబర్ 21 : గణిత శాస్త్రవేత్త రామానుజన్ జయంతి సందర్భంగా ప్రజ్ఞాపూర్ సెయింట్ మేరీస్ పాఠశాల విద్యార్థులు 1729 ఆకారంలో కూర్చొని ఆయనకు నివాళులర్పించారు.

# ఉత్తర ద్వార దర్శనానికి ఆలయం ముస్తాబు



ఉత్సవ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఈవో, చైర్మన్

సిద్దిపేట టౌన్, డిసెంబర్ 21 : ఉత్తర ద్వార దర్శనానికి సిద్దిపేట మోహినిపుర వేంకటేశ్వర ఆలయాన్ని ముస్తాబు చేశామని ఆలయ కార్యనిర్వహణాధికారి విశ్వనాథశర్మ, ఆలయ వ్యవస్థాపక అనువంశిక ధర్మకర్త చైర్మన్ నగేశ్ విష్ణు తెలిపారు. ఈనెల 23న వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని స్వామి సన్నిధిలో గురువారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ధనుర్మాసంలో ఉత్తర ద్వార దర్శనం చేసుకోవడం ఆనవాయితీగా వస్తున్నదన్నారు. స్వామివారి దర్శనం కోసం వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా సకల సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. భక్తుల కోసం ఐదు క్యూలైన్లను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. అందులోనే వీవీపీ క్యూలైన్‌లో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, మీడియా వారికి స్వామివారి దర్శనం కల్పిస్తామన్నారు. ఈసారి ప్రత్యేకంగా లోకల్ వారి కోసం వీవీపీ క్యూలైన్ ద్వారా ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉత్తర ద్వార దర్శనం కల్పిస్తున్నామని తెలిపారు. భక్తులు అందరూ తమకు సహకరించి ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం ఉత్తర ద్వారా దర్శన ఉత్సవ కరపత్రాన్ని ఆవిష్కరించారు. అంతకుముందు ఉత్తర ద్వార దర్శనం ఏర్పాట్లను ఏసీపీ సురేందర్‌రెడ్డి పరిశీలించారు. సమావేశంలో ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి



అక్కన్నపేట : విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో

అక్కన్నపేట, డిసెంబర్ 21 : ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. గురువారం మండలంలోని గౌరవెల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలను డీఈవో సందర్శించారు. ఈ సందర్భంగా విద్యాశాఖ ద్వారా అమలవుతున్న 'ఉన్నతి' కార్యక్రమం గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. ఆయన వెంట ఎంఈవో నర్సింహారెడ్డి, ఆయా పాఠశాల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ఉన్నారు.

**పోతారం(ఎస్) ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన డీఈవో**

హుస్నాబాద్ రూరల్, డిసెంబర్ 21 : పదో తరగతి పరీక్షా కేంద్రాల ఏర్పాటు కోసం మండలంలోని పోతారం(ఎస్) ప్రభుత్వ పాఠశాల, జిల్లెలగడ్డలోని తెలంగాణ కేజీ టు పీజీ కళాశాలను డీఈవో శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లోని తరగతి గదులు, ఫర్నిచర్ గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు.

## నర్సరీలను సందర్శించిన అధికారులు

నారాయణరావుపేట, డిసెంబర్ 21 : మండల కేంద్రమైన నారాయణరావుపేటలోని నర్సరీలను గురువారం జడ్పీ సీఈవో రమేశ్, డీఆర్డీవో జయదేవ్ సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. వారి వెంట ఎంపీడీవో మురళీధర్‌శర్మ, ఎంపీవో శ్రీనివాస్, ఎంపీవోలు నర్సింగరావు, స్రవంతి పాల్గొన్నారు.

## విద్యా హక్కు చట్టంపై అవగాహన ఉండాలి

చేర్యాల, డిసెంబర్ 21 : విద్యా హక్కు చట్టంపై విద్యార్థులకు అవగాహన ఉండాలని ఎంఈవో మొగుళ్ల నర్సింహారెడ్డి సూచించారు. గురువారం మండలంలోని ఆకునూరు, తాడూరు గ్రామాల్లో బడి బయట ఉన్న పిల్లల గురించి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 6 నుంచి 14 ఏండ్ల వయస్సు కలిగిన బడీడు పిల్లలను బడిలో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో సీఆర్పీ కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

## భద్రాచల దేవస్థాన ఆహ్వాన పత్రిక అందజేత

గజ్వేల్, డిసెంబర్ 21: భద్రాచల దేవస్థానంలో ఈనెల 23న జరిగే ముక్కోటి ఏకాదశి ఆహ్వాన పత్రికను రామకోటి రామరాజు గురువారం మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, కమిషనర్ విద్యాధర్, సీఐ జాన్‌రెడ్డికి అందజేశారు. ముక్కోటి ఏకాదశి రోజున తెల్లవారుజాము నుండే ఆలయాల్లో భక్తులు ఉత్తర ద్వారం నుంచి స్వామి వారిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొంటారని రామరాజు తెలిపారు.

## అపరాధ రుసుము లేకుండా పన్ను చెల్లించాలి

హుస్నాబాద్‌టౌన్, డిసెంబర్ 21: ఇంటి పన్ను వసూళ్లను వేగవంతం చేయాలని మున్సిపల్ ఇన్‌చార్జి మేనేజర్ కృష్ణ అధికారులకు సూచించారు. గురువారం పట్టణంలో మున్సిపల్ సిబ్బంది ఇంటి పన్ను వసూల్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపరాధ రుసుము లేకుండా పన్నులు చెల్లించే అవకాశం ప్రభుత్వ కల్పించిందన్నారు. ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఈనెల 31లోపు ఇంటి పన్ను చెల్లించాలని ప్రజలకు సూచించారు. ప్రజలు పన్ను చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని కోరారు.

## ఈ-కేవైసీ కోసం మహిళల పడిగాపులు

హుస్నాబాద్ టౌన్, డిసెంబర్ 21 : కాంగ్రెస్ ప్రభుత్వం అందించే రూ.500 గ్యాస్ కనెక్షన్లు పొందేందుకు ఈ-కేవైసీ తప్పనిసరి చేశారు. దీంతో మహిళలు రూ.500 గ్యాస్ సిలిండర్‌ను పొందేందుకు గ్యాస్ ఏజెన్సీల వద్ద క్యూకడుతున్నారు. రెండు రోజులుగా వివిధ గ్రామాలకు చెందిన మహిళలు స్థానిక ఇండెన్ గ్యాస్ ఏజెన్సీ ఎదుట ఈ-కేవైసీ చేయించుకునేందుకు పడిగాపులు పడుతున్నారు. సర్వర్ మొరాయించడంతో రోజంతా మహిళలు అక్కడే వేచిచూడాల్సి వస్తున్నది.



హుస్నాబాద్‌లో ఈ-కేవైసీ కోసం గ్యాస్ ఏజెన్సీ ఎదుట నిరీక్షిస్తున్న మహిళలు